సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం । 12 । జనవరి । 2025



కనులపండువగా కుడారై

కాళ్ల: కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో కుడారై ఉత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. 1250 గిన్నెలతో స్వామివారికి ప్రసాదాన్ని నివేదించారు.



మెరిసిన దేవదేవుడు

ద్వారకాతిరుమల: క్షేత్రంలో ఉదయం చిన వెంకన్న తిరువీధి సేవ నేత్రపర్వంగా సాగింది. అధ్యయనోత్సవాలను పురస్కరించుకుని **రాత్రి సైతం తిరువీధి సేవ నిర్వహించారు.**



బాల్య వివాహాలతో అనర్థాలు

భీమడోలు: బాల్య వివాహాలతో అనర్థాలు తప్పవని గుండుగొలను వైద్యాధికారి కె.శ్రీలక్ష్మి అన్నారు. గుండుగొలనులో బాల్య వివాహాల నిరోధంపై ర్యాలీ నిర్వహించారు.

సంక్రాంతులు కరువు

సంక్రాంతికి పేరొందిన పశ్చిమగోదావరి జిల్లాలో పండుగ కళ తప్పింది. జనం వద్ద డబ్బుల్లేక మునుపటిలా మార్కెట్‌లో పండుగల సందడి కనిపించడం లేదు. ప్రధానమైన వస్త్ర, కిరాణా, బంగారం, ఫ్యాన్సీ అమ్మకాలు సగానికి పైగా పడిపోయి దుకాణాలు వెలవెలబోతున్నాయి. సంక్రాంతి సీజన్‌లో గతంలో ఎన్నడూ ఇలాంటి గడ్డు పరిస్థితి చూడలేదని వ్యాపారులు అంటున్నారు.

కళ తప్పిన పెద్ద పండుగ

- మార్కెట్‌లో కనిపించిన పండుగల జోష్
- ఏటా జిల్లాలో సంక్రాంతికి రూ.200 కోట్లకు పైగా వ్యాపారం
- సంక్షేమం జాడలేక సగానికి తగ్గిన అమ్మకాలు
- వెలవెలబోతున్న వస్త్ర, కిరాణా, బంగారం దుకాణాలు
- డీలాపడ్డ వ్యాపారులు



తాడేపల్లిగూడెంలో మాల్స్ వద్ద కనిపించని సందడి



నరసాపురంలో వెలవెలబోతున్న దుకాణాలు

సాక్షి, భీమవరం : పెళ్లిళ్లు, మిగిలిన పండుగలతో పోలిస్తే సంక్రాంతి సీజన్‌లో రెండు మూడు రెట్లు అధికంగా మార్కెట్‌లో అమ్మకాలు జరిగేవి. క్రిస్మస్ మొదలు న్యూ ఇయర్, సంక్రాంతి పండుగల వరకు నెల రోజులపాటు వస్త్ర, కిరాణ, ఫ్యాన్సీ, బంగారం, ఫుట్‌వేర్, పెయింట్స్, స్వీట్స్ తదితర ఏ షాపు చూసినా వినియోగదారులతో కిటకిటలాడేవి. అందుకు తగ్గట్టుగానే వ్యాపారులు క్రిస్మస్‌కు ముందే ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, ఈరోడ్ తదితర హోల్‌సేల్ మార్కెట్‌లకు వెళ్లి కొత్త స్టాకులు ఖరీదు చేసేవారు. బయట అప్పు చేసైనా ఎక్కువ మొత్తంలో స్టాకు తెచ్చి అమ్మకాలకు సిద్ధం చేసుకునేవారు.

సగానికి తగ్గిన వ్యాపారం : సంక్రాంతి పండుగల నిమిత్తం వస్త్ర వ్యాపారం, పిండి వంటల తయారీకి కిరాణా సరుకులు, కొత్త అల్లుళ్లకు కానుకగా బంగారు వస్తువుల తయారీతో గోల్డ్ అమ్మకాలు ఎక్కువగా జరిగేవి. వీటికి అనుబంధంగా ఫ్యాన్సీ, ఫుట్‌వేర్, టీవీలు, సెల్‌ఫోన్లు, రిఫ్రిజిరేటర్లు తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు, మోటారు సైకిళ్లు, కార్లు తదితర రూపాల్లో రూ.250 కోట్లకు పైగా వ్యాపారం జరిగేది. దూర ప్రాంతాల నుంచి స్వస్థలాలకు వచ్చిన వారితో మార్కెట్లు రద్దీగా కనిపిస్తున్నా సంక్రాంతి అమ్మకాలు సగానికి పైగా పడిపోయినట్టు వ్యాపార వర్గాలు అంటున్నాయి. అప్పులు చేసి తెచ్చిన స్టాకులు అమ్ముడుపోక ఏం చేయాలో పాలుపోవడం లేదని వ్యాపారులు వాపోతున్నారు.

ఆన్‌లైన్ డెలివరీలూ తగ్గాయి

మరోపక్క ఆన్‌లైన్ ఆర్డర్లు తగ్గిపోయినట్టు డెలివరీ బాయ్స్ చెబుతున్నారు. గతంలో పండుగల రోజుల్లో తీరిక లేకుండా రోజుకు 60 నుంచి 70 వరకు ఆర్డర్లు డెలివరీలు ఉంటే ఇప్పుడు 40 నుంచి 50 వరకు చేస్తున్నట్టు భీమవరానికి చెందిన డెలివరీ బాయ్ రమేష్ తెలిపారు. తమ బ్రాంచీకి వచ్చే డెలివరీల సంఖ్య గతంలో పోలిస్తే తగ్గిందని చెప్పారు.

ఎన్నడూ చూడలేదు



ఎన్నో ఏళ్లుగా వస్త్ర వ్యాపారం చేస్తున్నాం. గతంలో ఎప్పుడూ ఇటువంటి పరిస్థితి లేదు. సంక్రాంతికి గతంలో రూ.7 లక్షల అమ్మకాలు జరిగితే ఇప్పుడు రూ.2 లక్షలు కూడా లేవు. జనం దగ్గర డబ్బులు లేక మార్కెట్ డల్ అయిపోయింది.

–యర్రా శ్రీను, బట్టల షాపు యజమాని, నరసాపురం

రైతుల జీవితాల్లో వెలుగులు లేవు



రైతులు తీవ్ర నిరాశ, నిస్పృహలతో ఉన్నారు. కూటమి ప్రభుత్వం రూ.20 వేల పెట్టుబడి సాయం హామీ అమలు చేయలేదు. ఖరీఫ్ సాగులో ఒడిదుడుకులు ఎదుర్కొన్న రైతులు రబీలోనైనా గట్టెక్కుదాం అనుకుంటే పెట్టుబడి సాయం అందించడం లేదు. దీంతో రైతులు, కౌలుదారుల కుటుంబాల్లో సంక్రాంతి వెలుగులు లేకుండా పోయాయి.

– కె.శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

సంక్షేమం జాడలేక..



భీమవరంలో వినియోగదారులు లేక ఖాళీగా ఉన్న వస్త్ర దుకాణం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి నెలా ఏదోక సంక్షేమ పథకం చేతికంది పేదవర్గాల వద్ద డబ్బులుండటం వల్ల పండుగల సమయంలో మార్కెట్లు కళకళలాడేవి. ప్రస్తుతం సూపర్ సిక్స్ అంటూ వచ్చిన కూటమి ప్రభుత్వం వాటి ఊసెత్తడం లేదు. విపత్తులతో తొలకరి పంటకు నష్టం రాగా ప్రభుత్వం రైతులకు భరోసా ఇవ్వలేదు. ఇసుక కొరతతో భవన నిర్మాణ కార్మికులకు సరిగా పనులేకపోవడం, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవడం తదితర కారణాలతో జనం వద్ద డబ్బులు లేకుండా పోయాయి. ఇప్పటికే క్రిస్మస్, న్యూ ఇయర్ అమ్మకాలు లేక పెద్ద పండుగపైనే ఆశలు పెట్టుకున్న వ్యాపారులకు సంక్రాంతి సేల్స్ తీవ్ర నిరాశను మిగులుస్తున్నాయి. చిన్న దుకాణాలతో పాటు షోరూమ్‌లు, మాల్స్‌లో సైతం అమ్మకాలు తగ్గిపోయాయి. జిల్లాలో వ్యాపార కేంద్రాలుగా పేరొందిన భీమవరంలోని జువ్వలపాలెం రోడ్డు, మల్టీప్లెక్స్ ఏరియా, డీఎన్ఆర్ కళాశాల రోడ్డు, తాడేపల్లిగూడెం వన్‌టౌన్‌లోని కేఎన్ రోడ్డు, తాలుకా ఆఫీస్ రోడ్డు, నరసాపురంలోని స్టీమర్ రోడ్డు, తణుకులోని వేల్పూరు రోడ్డు, రాష్ట్రపతి రోడ్డు, పాలకొల్లులోని బస్టాండ్ సెంటర్‌లు రద్దీ లేక వెలవెలబోతున్నాయి.

న్యూస్‌రీల్

పోరాటయోధుడు ఓబన్న



కలెక్టరేట్‌లో ఓబన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

భీమవరం(ప్రకాశం చౌక్): స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలను భీమవరం కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించారు. ఓబన్న చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ అధికారి జీవీఆర్ కేఎస్ గణపతిరావు మాట్లాడుతూ ఓబన్న దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ పాలకులపై పోరాటం చేసి యోధుడు అన్నారు. యానాది, చెంచు జాతుల హక్కుల పరిరక్షణకు విశేష కృషి చేశారన్నారు. కలెక్టరేట్ ఏఓ హెచ్.నరేష్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆత్మహత్యల నివారణలో కూటమి విఫలం



మాట్లాడుతున్న జమలయ్య

భీమవరం: రైతుల ఆత్మహత్యలను నివారించడంలో కూటమి ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య విమర్శించారు. శనివారం భీమవరం సీపీఐ కార్యాలయంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి వైవీ ఆనంద్ అధ్యక్షతన జరిగిన కౌలు రైతు సంఘం జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీ మేరకు రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇప్పటికీ ఇవ్వకపోవడం దారుణమన్నారు. పంటల బీమా ప్రీమియాన్ని రైతులే చెల్లించాలనడం మోసం చేయడమేనని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో 97 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే చర్యలు లేవని, పరిహారం కూడా ప్రకటించలేదని దుయ్యబట్టారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ శివారు భూములకు సాగునీరు అందించాలని కోరారు. చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, ఎం. లక్ష్మీపతి పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు



రాజవరం సమీపంలోని పులపాకులు చెరువులో మట్టి తవ్వకం

కొయ్యలగూడెం: రాజవరం-యర్రంపేట గ్రామాల మధ్య పులపాకుల చెరువు నుంచి మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. నెల రోజుల నుంచి రాత్రిళ్లు పొక్లయిన్లతో అక్రమార్కులు మట్టిని తవ్వి తరలిస్తున్నారని రైతులు అంటున్నారు. ఇటీవల విషయం ఇరిగేషన్ శాఖ అధికారుల దృష్టికి వెళ్లడంతో పీడబ్ల్యూడీ డీఈ రవీంద్ర సిబ్బందితో వెళ్లి విచారణ చేశారు. మట్టి తవ్వకాలు జరిగినట్టు నిర్ధారించి ఉన్నతాధికారులకు నివేదించారు. అయినా అక్రమ తవ్వకాలు ఆగడం లేదు. రోజుకు 50కు పైగా లారీల్లో మట్టిన తరలిస్తున్నారని రైతులు చెబుతున్నారు. ఇటీవల బైఫ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చెరువు గట్టు, చెరువు అంతర్భాగంలో అభివృద్ధి పనులు చేశారని మట్టి రవాణాతో పనులు ధ్వంసమవుతున్నాయని రైతులు వాపోతున్నారు.

తిరుపతి తొక్కిసలాట ఘటనలో బాధ్యులపై చర్యలేవి?

కొయ్యలగూడెం: తిరుపతి దుర్ఘటనకు సంబంధించి నటుడు అల్లు అర్జున్‌పై మోపిన సెక్షన్లనే కలెక్టర్, ఈఓ, టీటీడీ చైర్మన్, డీఎస్పీలపై నమోదు చేయాలని వినియోగదారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏఆర్‌కే హనుమంతరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీకి లేఖ రాసినట్టు శనివారం కొయ్యలగూడెంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దుర్ఘటన జరిగి మూడు రోజులు అవుతున్నా కారకులైనవారిని గుర్తించి కూడా చర్యలు తీసుకోకపోవడం ప్రభుత్వ తప్పిదానికి నిదర్శనమని తెలిపారు. హైదరాబాద్‌సంధ్య థియేటర్ దుర్ఘటనలో ఒకరు చనిపోతే 16 మందిపై కేసు పెట్టారని, కానీ తిరుపతిలో ఆరుగురు చనిపోయినా కారకులను శిక్షించకుండా ఉపేక్షించడం నేరమని స్పష్టం చేశారు. గవర్నర్ జోక్యం చేసుకోవాలని కోరారు.

ఈడీగా ముక్కంటి

ఏలూరు (టూటౌన్): ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా ముక్కంటి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. గత ఎన్నికల్లో ఏలూరు అసెంబ్లీకి ఆయన రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు.

● పనుల్లో జాప్యం.. ప్రయాణం నరకం



కె.సముద్రపుగట్టు వద్ద తారు వేయకుండా వదిలేయడంతో రోడ్డు ఇలా..



ఈడూరు వద్ద గోతులమయంగా రహదారి


భీమవరం-అత్తిలి మార్గంలో ఆర్‌అండ్‌బీ రహదారి ఆధునికీకరణ పనులు అర్ధాంతరంగా నిలిపివేశారు. ఇరగవరం మండలంలోని గవర్లపాలెం నుంచి అత్తిలి వరకు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కంకర, మెటల్ చిప్స్‌తో లెవెల్ చేశారు. అయితే తారుతో లేయర్ వేయకపోవడంతో కంకర పైకి లేచి వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అలాగే దుమ్ము భారీగా వ్యాపిస్తోంది. అలాగే అత్తిలి నుంచి కొమ్మర, ఈడూరు మీదుగా భీమవరం వెళ్లే రోడ్డు గోతులమయంగా మారింది. వీటిపై ఆర్‌అండ్‌బీ డీఈ వరలక్ష్మిని వివరణ కోరగా త్వరలో గవర్లపాలెం-అత్తిలి వరకు రోడ్డు ఆధునికీకరణ పనులు పూర్తిచేస్తామని చెప్పారు.

- అత్తిలి

ఉత్తమ ఉపాధ్యాయులను ముఖ్యమంత్రే సత్కరించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉభయగోదావరి జిల్లాల నుంచి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన వారికి గత ఏడాది నవంబర్ 11న విజయవాడలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో సత్కారం జరగలేదని, అటువంటి ఉపాధ్యాయులకు తిరిగి ముఖ్యమంత్రి ద్వారానే సత్కార కార్యక్రమం ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 1938 జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.రత్నం బాబు, జి మోహన్‌రావు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాలో 26 మంది ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్న కారణంగా అవార్డుల ప్రధానోత్సవం వాయిదా పడిందని పేర్కొన్నారు. వీరికి అవార్డులను జిల్లా కేంద్రాల్లో కలెక్టర్ల ద్వారా అందించడానికి పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులను జారీ చేయడం సరికాదని తెలిపారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు ముఖ్యమంత్రి చేతులమీదుగా అవార్డును అందుకోవడం గొప్ప గౌరవమని, అలాంటి గౌరవాన్ని దూరం చేయడం తగదన్నారు. కమిషనర్ ఉత్తర్వులను సవరించి జనవరి 26న రిపబ్లిక్ డే సందర్భంగా ముఖ్యమంత్రి చేతులమీదుగా పురస్కారాలు అందించేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకు విద్యాశాఖ మంత్రి జోక్యం చేసుకోవాలని కోరారు.

ఐటీడీఏ పీఓగా రాములు నాయక్



బుట్టాయగూడెం: కేఆర్ పురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా కేతావత్ రాముల నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి నియామక ఉత్తర్వులు శనివారం వెలువడ్డాయి. కృష్ణా జిల్లా సర్వశిక్షా అభియాన్ పీఓగా పని చేస్తున్న రాముల నాయక్ ఇక్కడికి పీఓగా రానున్నారు. ఆయన గతంలో గుంటూరు జిల్లాలో తహసీల్దార్‌గా పనిచేశారు. తర్వాత అమరావతి సీఏడీ, సీఎంఓ కార్యాలయాలు, ఏలూరులో విజిలెన్స్ శాఖలో పనిచేశారు. కాగా కేఆర్‌పురం ఐటీడీఏ పీఓగా పనిచేస్తున్న ఎం.సూర్యతేజ నెల్లూరు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. అప్పటినుంచి జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ఇన్‌చార్జి పీఓగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ప్రైవేట్ ట్రావెల్స్‌పై కొరడా



ప్రైవేట్ బస్సులను తనిఖీ చేస్తున్న అధికారులు

సాక్షి స్పందన

భీమవరం(ప్రకాశం చౌక్): సంక్రాంతి పండగకు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల టికెట్ చార్జీల బాదుడుపై 'సాక్షి' పత్రికలో వరుస కథనాలు రావడం, జిల్లా రవాణా శాఖ అధికారి దృష్టికి తీసుకువెళ్లడంపై జిల్లా రవాణా శాఖ అధికారి టి.ఉమామహేశ్వరరావు స్పందించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేట్ బస్సులపై నిఘా పెట్టారు. జిల్లాలో తాడేపల్లిగూడెం, తణుకు ప్రాంతంలో ఓ బృందం, భీమవరం, పాలకొల్లు ప్రాంతంలో మరో బృందంతో ప్రత్యేక తనిఖీలు చేయిస్తున్నారు. రెండు రోజుల్లో 96 కేసులు రాసి రూ.14.35 లక్షల జరిమానా విధించారు. వేల రూపాయలు జరిమానా విధించారు. అలాగే ట్యాక్స్ పెనాల్టీ చెల్లించకుండా పర్మిట్ నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న రెండు వాహనాలను సీజ్ చేశారు. డీటీఓ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పండుగల తర్వాత కూడా ప్రత్యేక బృందాల తనిఖీలు కొనసాగుతాయని, అధిక చార్జీలు వసూలు చేస్తే సహించబోమని హెచ్చరించారు.

బరితెగింపు

- ఊరూరా కోడి పందేల బరులు
- గుండాట, పేకాటలకు ప్రత్యేక ఏర్పాట్లు
- కోడి పందేల బరుల కోసం రూ.కోటి వరకు ఖర్చు
- జిల్లాలో సుమారు 130 వరకు బరులు



భీమవరం మండలంలో సిద్ధం చేస్తున్న బరి



కాళ్ల మండలంలో ఏర్పాటుచేస్తున్న పందేల బరి

సాక్షి, భీమవరం: కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్న పోలీస్ హెచ్చరికలను సవాల్ చేస్తూ నిర్వాహకులు పందెం బరులు సిద్ధం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా దాదాపు 130 బరులు ఏర్పాటుచేస్తుండగా వీటిలో భారీ ఎత్తున పందేలు జరిగేవి 38, చిన్నవి 92 ఉన్నాయి. బరుల వద్దనే గుండాట, పేకాట తదితర జూద కార్యకలాపాలకు ఏర్పాట్లు చేశారు.

వీఐపీ గ్యాలరీలు : భీమవరం పరిసరాల్లోని డేగాపురం, కొవ్వాడ అన్నవరం, పెదఅమిరం, సీసలిలో భారీ సెట్టింగ్‌లతో ఏర్పాటు చేస్తున్న బరులకు ఒక్కో దానికి రూ.80 లక్షల నుంచి రూ.కోటి వరకు ఖర్చు చేస్తున్నట్టు సమాచారం. మిగిలిన చోట్ల రూ.5 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు వెచ్చించి బరులను సిద్ధం చేస్తున్నారు. పెద్ద బరులను దాదాపు ఆరు నుంచి పది ఎకరాల్లో వీఐపీ, వీవీఐపీల కోసం ప్రత్యేక గ్యాలరీలు, భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లు, గుండాట, పేకాట, ఇతర జూదాలు నిర్వహించేందుకు వీలుగా జర్మన్ షెడ్లు, ఫ్లడ్ లైట్లు, నగదు లెక్కించేందుకు కౌంటింగ్ మెషీన్లు ఏర్పాటు చేస్తున్నారు. అన్ని బరుల వద్ద మద్యం స్టాళ్లు, ఫాస్ట్ ఫుడ్స్, తినుబండరాలకు స్టాళ్లు సిద్ధం చేస్తున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన నాలుగు పెద్ద బరుల వద్ద ఒక్కో పందె రూ.10 లక్షలు నుంచి రూ.50 లక్షల వరకు జరిగితే, ఓ మాదిరి బరుల వద్ద రూ.లక్ష నుంచి రూ.10 లక్షలు వరకు, చిన్న బరుల వద్ద రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు పందేలు జరుగుతాయి. అలాగే పైపందాల రూపంలో కోట్లాది రూపాయలు చేతులు మారుతాయి. వీటితో పాటు బరుల బయట చిన్న పందేలకు లేక్కే లేదు.

పందెంపై కమీషన్

ఒక్కో బరిలో రోజుకు 30 నుంచి 40 వరకు పందేలు జరుగుతాయి. పుంజులను బరిలో దించిన వారు కాసుకున్న పందెం నగదుపై నిర్వాహకులు రెండు నుంచి పది శాతం వరకు కమీషన్ తీసుకుంటారు. బరుల వద్ద గుండాట, పేకాట, ఇతర జూదాలు, అశ్లీల నృత్యాలు, మద్యం స్టాళ్లు, చికెన్ పకోడీ, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లను జూదాల్లో ఆరితేరిన నిర్వాహకులకు భారీ మొత్తంలో కాంట్రాక్టుకు ఇవ్వడం ద్వారా పెట్టిన ఖర్చుకు రెండు మూడు రెట్లు రాబడతారు. ఈ లాభం నుంచే నేతలు, పోలీసులకు మామూళ్లు పంపి మిగిలింది నిర్వాహకులు పంచుకుంటారు. రాత్రి పూట టీవీ యాంకర్‌లు, జబర్దస్త్ నటులతో వినోద కార్యక్రమాలు ఏర్పాటుచేసి వాటి మాటున పెద్ద ఎత్తున పందేలు, గుండాట, పేకాట జూదాలు నిర్వహించడానికి సిద్ధమయ్యారు.

నియోజకవర్గాల వారీగా బరులు

- **భీమవరం:** భీమవరం రూరల్‌లోని డేగాపురం, కొవ్వాడ అన్నవరం, వీరవాసరం మండలం వీరవాసరం, కొణితివాడలో భారీ బరులు, నందమూరు గరువు, ఉత్తరపాలెం, మత్స్యపురి, నౌడూరులో చిన్న బరులు సిద్ధం చేస్తున్నారు.
- **ఉండి:** ఉండి మండలంలో ఉండి, పాములపర్రు, కోలమూరు, యండగండి, మహాదేవపట్నం, వాంద్రం, చెరుకువాడ, కాళ్ల మండలంలో పెదఅమిరం, సీసలిలో భారీ బరులు సిద్ధం చేశారు. కాళ్ల, దొడ్డనపూడి, కాళ్లకూరు, ఏలూరుపాడు, మాలవానితిప్ప, పాలకోడేరు మండలంలో శృంగవృక్షం, పెన్నాడ, వేంద్ర, మోగల్లు, పాలకోడేరు, గొల్లలకోడేరు, కోరుకొల్లు, విస్సాకోడేరు, ఆకివీడు మండలంలో అయి భీమవరం, కుప్పనపూడి, మాదివాడ, చినకాపవరం, సిద్దాపురం గ్రామాల్లో బరులను సిద్ధం చేశారు.
- **తాడేపల్లిగూడెం:** పట్టణంలోని ఏరియా ఆస్పత్రి సమీపంలో పెద్ద బరిని ఏర్పాటుచేయగా, రూరల్‌లోని పెదతాడేపల్లి, వెంకట్రామన్నగూడెం, పట్టింపాలెం, కడియద్ద, నందమూరు, నవాబ్‌పాలెం, అప్పారావుపేట, పెంటపాడు మండలంలో పెంటపాడు, కె.పెంటపాడు, అల్లంపురం, దర్శిపర్రులో పందాల బరులు ఏర్పాటు చేస్తున్నారు.
- **ఆచంట:** పెనుమంట్ర మండలంలోని పెనుమంట్ర, మార్టేరు, వెలగలేరు, ఆలమూరు, వెలగలవారిపాలెం, జుత్తిగ, నత్తారామేశ్వరం, పెనుగొండ మండలంలోని పెనుగొండ వడలి, దొంగ రావిపాలెం, పెళ్లికూతురమ్మ చెరువు, ములపర్రు, చిన్న మల్లం, ఆచంట మండలంలో ఆచంట, వల్లూరుతోట, కొడమంచిలి గ్రామాల్లో బరులు ఏర్పాటు చేస్తున్నారు.
- **పాలకొల్లు:** పాలకొల్లు మండలం పూలపల్లిలో రెండు, వడ్లవానిపాలెంలో ఒకటి, యలమంచిలి మండలం కలగంపూడి, యలమంచిలి గ్రామాల్లో పెద్ద బరులను ఏర్పాటు చేస్తున్నారు. పాలకొల్లు రూరల్ తిల్లపూడి, శివదేవునిచిక్కాల, లంకలకోడేరు, దగ్గులూరు, చింతపర్రు, వాలమర్రు, యలమంచిలి మండలం కొంతేరు, కాజ, మేడపాడు, మట్లపాలెం, కట్టుపాలెం, బూరుగుపల్లి, కనకాయలంక గ్రామాల్లో చిన్న బరులు సిద్ధం చేస్తున్నారు.
- **నరసాపురం:** నరసాపురం ప్రభుత్వాసుపత్రి వెనుక నాలుగు, వీవర్స్ కాలనీ, ఆదర్శనగర్ వద్ద మూడు, నరసాపురం రూరల్‌లోని వేములదీవి, లక్ష్మణేశ్వరం, తూర్పుతాళ్లు, పసలదీవి, పితానిమెరక, మల్లవరం, నవరసపురం గ్రామల్లో, మొగల్తూరు మండలంలో పేరుపాలెం, మోళ్లపర్రు, కాళీపట్నం, రామన్నపాలెం గ్రామాల్లో బరులు సిద్ధం చేస్తున్నారు.
- **తణుకు:** అత్తిలి మండలం కేపీస్ గట్టు, ఎల్ఎన్ పురం, గుమ్మంపాడు, తణుకు మున్సిపాలిటీలో నాలుగుచోట్ల, తణుకు మండలంలో తేతలిలో 3, వేల్పూరులో 2, దువ్వ, మండపాకలో ఒక్కో బరి సిద్ధం చేస్తున్నారు.

క్లుప్తంగా

లారీ ఢీకొని మహిళ మృతి



భార్య రామ సీత మృతదేహం వద్ద రోదిస్తున్న భర్త బాపిరాజు

పాలకోడేరు: పాలకోడేరు గ్రామ శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందింది. పాలకోడేరు మండలం కోరుకొల్లు గ్రామానికి చెందిన ఉద్ధరాజు బాపిరాజు భార్యతో కలిసి హాస్పటల్‌కు వెళ్లి భీమవరం వస్తుండగా పాలకోడేరు శివారులో కోటేశ్వరరాజు గెస్ట్ హౌస్ దగ్గర వెనుక నుంచి వస్తున్న లారీ బలంగా ఢీకొంది. మోటార్ సైకిల్ వెనక కూర్చున్న బాపిరాజు భార్య బుద్ధరాజు రామ సీత (69) తలపై నుంచి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. బాపిరాజుకి స్వల్ప గాయాలయ్యాయి. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పాలకోడేరు ఏఎస్ఐ మోహన్ రావు కేసు నమోదు చేశారు. లారీ డ్రైవర్‌ను అదుపులో తీసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రూ.36 లక్షల చోరీ సొత్తు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ డి.విశ్వనాథ్

తాడేపల్లిగూడెం అర్బన్ : తాడేపల్లిగూడెం పట్టణంలో రాత్రి సమయాల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడిన నేరస్తుడిని అరెస్టు చేసినట్లు తాడేపల్లిగూడెం డీఎస్పీ డి.విశ్వనాథ్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాపట్ల జిల్లాకు చెందిన జంగాల శాంతి స్వరూప్‌కుమార్ అలియాస్ వినయ్‌కుమార్ తాడేపల్లిగూడెం పట్టణంలో కొద్దిరోజులుగా రాత్రి సమయాల్లో చోరీలకు పాల్పడుతున్నాడని చెప్పారు. తమకు అందిన సమాచారం మేరకు సీఐ ఎ.సుబ్రహ్మణ్యం, ఎస్సైలు పి.నాగరాజు, బి.శ్రీనివాస్‌లు బృందాలతో వెళ్లి జంగాల శాంతిస్వరూప్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి రూ.36 లక్షల విలువ గల 471 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. శాంతిస్వరూప్ 2008 నుంచి నుంచి 2018 వరకు పలు రాష్ట్రాల్లో సుమారు 20 చోరీలకు పాల్పడ్డాడు.

అధికారులకు శిక్ష తప్పదు

పశువధ శాల నిర్వహణను తప్పుపట్టిన న్యాయవాదులు



తణుకులో మాట్లాడుతున్న న్యాయవాది రమేష్

తణుకు అర్బన్ : తణుకు మండలం తేతలి పరిధిలో అక్రమంగా నిర్వహిస్తున్న లాహం ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తీరుపై న్యాయవాదులు స్పందించారు. శనివారం తణుకులోని తుమ్మలపల్లి సత్రంలో గోసేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంస్థ వైఖరిని, అధికారులు వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టారు. న్యాయవాది అనుకుల రమేష్ మాట్లాడుతూ పశువధ వ్యవహారంలో చాలా అక్రమాలు ఉన్నాయని స్పష్టం చేశారు. కర్మాగారం నుంచి వస్తున్న దుర్వాసనతో స్థానికులు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అనుమతులు ఉన్నాయంటున్న పత్రాల్లో చాలా లోపాలు ఉన్నాయని సంస్థకు మేలు చేసే (?) నడుస్తున్న ప్రతి అధికారి రాబోయే రోజుల్లో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అసలు పత్రాల్లో ఏముందో కూడా చూడకుండా సంస్థను ప్రోత్సహిస్తున్న వైనాన్ని ప్రజలు గమనిస్తున్నారని, సంస్థ చూపిస్తున్నట్లుగా కర్మాగారం పరిధి 18.14 ఎకరాల భూమి లేదని ఆ విషయం తేతలి పంచాయతీ సెక్రటరీ తెలపాలని, పొల్యూషన్ విభాగానికి సంబంధించి కూడా తప్పుల తడకలా ఉందన్నారు. సంస్థ మేనేజరు ఇటీవల చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని తమ ప్రాంతానికి వచ్చి ఇబ్బందులు పెట్టే పరిస్థితుల్లో పశువధ ఎలా చేస్తారో తేలుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ఓఎస్ కృష్ణ, సుబ్బరాజు, కొత్తపల్లి చినరంగ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో వైఎన్ కళాశాలకు డీమ్డ్ హోదా

మంత్రి కందుల దుర్గేష్



వైఎన్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

నరసాపురం: వైఎన్ కళాశాల డీమ్డ్ యూనివర్సిటీ స్థాయికి త్వరలో చేరుకుంటుందని రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శనివారం రాత్రి జరిగిన వైఎన్ కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రానికి ఎంతో మంది లబ్ధ ప్రతిష్టులను అందించిన ఘనత వైఎన్ కళాశాలకు ఉందన్నారు. హైకోర్టు జడ్జి జస్టిస్ నయనాల జయసూర్య మాట్లాడుతూ వైఎన్ కళాశాలతో తన తండ్రికి అనుబంధం ఉందన్నారు. కళాశాల 100 ఏళ్ల పండుగ కూడా ఇదే స్ఫూర్తితో జరగాలన్నారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కలిగినీడి చిదంబరం తదితరులు మాట్లాడారు. ఉదయం జరిగిన కార్యక్రమంలో విజయనగరం పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ వైఎన్ కళాశాల పూర్వ విద్యార్థులు ప్రపంచంలో అనేక రంగాల్లో ఉన్నత స్థానంలో ఉన్నారన్నారు. కళాశాల అభ్యున్నతికి డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ సేవలు ఎనలేనివని చెప్పారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ మాట్లాడుతూ 75 ఏళ్లలో కళాశాల ఎంతో పురోగతి సాధించిందని చెప్పారు. పూర్వ విద్యార్థుల సహకారం మరువలేనిదన్నారు. పాండిచేరి యూనివర్సిటీ మాజీ వీసీ ఆర్ ప్రభాకరనాయుడు మాట్లాడుతూ ఇలాంటి కళాశాలల మనుగడ కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు పొన్నపల్లి శ్రీరామారావు, కోశాధికారి పోలిశెట్టి రఘురాం, కళాశాల పూర్వ విద్యార్థి, టెక్ మహేంద్ర ఉపాధ్యక్షుడు ఎం.నాగార్జున, పాలకవర్గ సభ్యులు బళ్ల వెంకటేశ్వరరావు, సీహెచ్ రెడ్డప్ప ధవేజీ, పాలంకి సుబ్బరాయన్, ప్రిన్సిపల్ సీహెచ్ కనకారావు తదితరులు పాల్గొన్నారు.

రాయకుదురులో నాటిక పోటీలు ప్రారంభం



కామిశెట్టి అయ్యప్ప నాయుడును కాంతారావు అవార్డుతో సత్కరిస్తున్న దృశ్యం

వీరవాసరం: కళలను, కళాకారులను గౌరవించే చోట ఆ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని ఆంధ్రప్రదేశ్ నాటక పరిషత్తు సమాఖ్య అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు తెలిపారు. శ్రీ కృష్ణదేవరాయ నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో ఐదో జాతీయ స్థాయి నాటక పోటీలు శుక్రవారం రాయకుదురులో మంతెన ప్రసాద్ ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. ఆయన మాట్లాడుతూ టీవీ రంగం మనిషిని చిన్నదిగా చూపిస్తుందని, నాటక రంగం మాత్రమే మనిషిని మనిషిగా చూపిస్తుందని వివరించారు. సమాజంలో ఉన్న రుగ్మతలను రూపుమాపడానికి నాటక ప్రదర్శనలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. పాలకొల్లు రోటరీ క్లబ్ చైర్మన్ కామిశెట్టి అయ్యప్ప నాయుడుకు కాంతారావు స్మారక సేవా రత్న అవార్డు ఇచ్చి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గెడ్డం భారతి భాస్కరరావు, ఎంపీపీ వీరవల్లి దుర్గ భవాని, వైస్ ఎంపీపీ అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ ఆకుల లీలా కృష్ణ, ఎంపీటీసీ కడలి నెహ్రూ, కామిశెట్టి అయ్యప్ప నాయుడు, వేంద్ర దివాకర్, కడలి వాసు, గుండా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దైవ దర్శనానికి వెళ్తూ..



ఘటనా స్థలంలో శ్యామ్‌ప్రసాద్, దివ్య మృతదేహాలు

శంఖవరం/భీమవరం : మరో రెండు రోజుల్లో సంక్రాంతికి కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడపాల్సిన వారు దైవ దర్శనానికి బయలు దేరి తిరిగిరాని లోకాలకు వెళ్లిన ఘటన శనివారం కాకినాడ జిల్లా కత్తిపూడిలో చోటు చేసుకుంది. భీమవరం పట్టణానికి చెందిన కరింశెట్టి సత్యనారాయణ మధు, కరింశెట్టి శివనారాయణ, కరింశెట్టి దివ్య, చవాకుల శ్యామ్‌ప్రసాద్, చవాకుల అనంతలక్ష్మి, చవాకుల అమ్మాజీ కలిసి స్నేహితుడు నిమ్మగడ్డ ధనుష్ కారులో అన్నవరం సత్యదేవుని దర్శనానికి బయలు దేరారు. ధనుష్ కారు నడుపుతుండగా మరో పది నిమిషాల్లో ఆలయానికి చేరుకునేలోపు ఫ్లై ఓవర్ వద్ద ఆగి ఉన్న లారీని కారు ఢీకొంది. ప్రమాదంలో భీమవరానికి చెందిన చవాకుల శ్యామ్‌ప్రసాద్, కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలానికి చెందిన కరింశెట్టి దివ్య అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన కరింశెట్టి శివనారాయణను ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. గాయపడిన సత్యనారాయణ మధు, అనంతలక్ష్మి, అమ్మాజీ, ధనుష్‌ను తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

బీటెక్, ఎంటెక్‌ల కన్నా సెలూన్‌లే బెటర్

మంత్రి రామానాయుడు

పాలకొల్లు సెంట్రల్: యువత బీటెక్‌లు, ఎంటెక్‌లు చదివేకన్నా హెయిల్ సెలూన్‌లు ఏర్పాటు చేసుకోవడమే బెటరేమో అంటూ రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. శనివారం పాలకొల్లులోని బీఆర్ఎంవీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కలిదిండి రామరాజు సౌత్ స్టేట్ లెవెల్ వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు క్రీడాకారుల హెయిర్ స్టైల్ చూసి 'యువత హెయిర్ స్టైల్ బాగుంది.. ఇప్పుడు బీటెక్‌లు, ఎంటెక్‌లు చదివేకన్నా హెయిర్ సెలూన్‌లు పెట్టుకుంటే బాగుంటుందేమో.. నెక్ట్స్ మనం ఏదైనా ప్లాన్ చేసుకుంటే బెటరేమో' అంటూ వ్యాఖ్యలు చేశారు. మంత్రి వ్యాఖ్యలపై సభలో ఉన్న కొందరు స్పందిస్తూ.. ప్రభుత్వం ఇక ఉద్యోగాలు ఇవ్వదేమో.. అందుకే ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ వ్యాఖ్యలు చేస్తున్నారంటూ విమర్శించారు.

కోడి పందేలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

భీమవరం: సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు, పేకాట, గుండాట వంటి జూదాలు ఇతర అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజల జీవితాలకు, సమాజ శాంతికి భంగం కలిగించే చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా సంక్రాంతి పండుగ నేపథ్యంలో జిల్లాలో కోడి పందేలు, పేకాట, గుండాట వంటి జూద క్రీడలు, ఇతర అసాంఘిక కార్యక్రమాలు పూర్తిగా నిషేధమని నిషేధాజ్ఞలు ధిక్కరిస్తే చట్ట ప్రకారం తీవ్రమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఉపాధి కూలీల నుంచి సొమ్ముల వసూలు దారుణం

భీమవరం : ఉపాధి కూలీల నుంచి ఐడెంటిటీ కార్డుల పేరుతో చేస్తున్న వసూళ్లు తక్షణం నిలిపివేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఇప్పటివరకు జాబ్ కార్డు ఆధారంగా కుటుంబ సభ్యులు ఎంతమంది ఉన్నా పని కల్పించేవారని, ఇప్పుడు రూ.60 చొప్పున వసూలు చేసి గుర్తింపు కార్డులివ్వాలని సర్క్యులర్ జారీచేయడం దారుణమన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,78,363 జాబ్ కార్డులు, 2,94,028 మంది కూలీలు ఉన్నారని వారి నుంచి డబ్బులు వసూలు చేసి సుమారు రూ.1.76 కోట్ల సొమ్మును ప్రైవేటు ఏజెన్సీకి కట్టబెట్టడం సరైంది కాదన్నారు.

రాష్ట్రంలో కిడ్నీ వ్యాధి నిపుణుల కొరత


వైద్య ఆరోగ్య మంత్రి సత్య కుమార్



ఆకివీడులో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్

ఆకివీడు: రాష్ట్రంలో నెఫ్రాలజిస్టుల కొరత తీవ్రంగా ఉందని వైద్య ఆరోగ్య శాఖమంత్రి సత్య కుమార్ చెప్పారు. ఆకివీడులో 30 పడకల ఆసుపత్రి భవనం, డయాలసిస్ కేంద్రం, ఉద్యానవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే నిర్మించిన ఈ భవనానికి రంగులు, ఫర్నిచర్ పూర్తిచేసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో డయాలసిస్ రోగుల సంఖ్య పెరుగుతుందని చెప్పారు. 55 డయాలసిస్ కేంద్రాలు ఉన్నాయని, దాతల సహకారంతో మరో రెండు కేంద్రాలు ప్రారంభించామన్నారు. భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో రూ.24 కోట్లతో క్రిటికల్ కేర్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. హార్ట్‌ఎటాక్‌లను నివారించేందుకు పీహెచ్‌సీల్లో ఏర్పాటు చేసిన ఇంజెక్షన్ల వల్ల 965 మంది ప్రాణాల్ని కాపాడామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు, కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, మాజీ ఎంపీ కనుమూరు బాపిరాజు, డీసీహెచ్ఎస్ పగడాల సూర్యనారాయణ, డీఎంహెచ్ఓ భాను నాయక్, ఆర్డీఓ ప్రవీణ కుమార్ రెడ్డి, మునిసిపల్ చైర్‌పర్సన్ జామి హైమావతి, వైస్ చైర్మన్ పుప్పాల పండు తదితరులు పాల్గొన్నారు.

ఎంబెరుమన్నార్‌ను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జయసూర్యకు స్వాగతం పలికి వేద ఆశీర్వచనాలు అందజేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: నరసాపురం పట్టణంలోని శ్రీ ఆది కేశవ ఎంబెరుమన్నార్ స్వామిని హైకోర్టు జడ్జి జస్టిస్ నైనాల జయసూర్య శనివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ చైర్మన్, అర్చకులు మంగళవాయిద్యాల నడుమ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామిని దర్శించుకున్న జస్టిస్ జయసూర్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి చిత్రపటాన్ని, తీర్థ ప్రసాదాలను ఆయనకు అందజేశారు.

శ్రీవారి క్షేత్రం.. భక్తజన సంద్రం



భక్తులతో కిక్కిరిసిన అనివేటి మండపం

ద్వారకాతిరుమల: చిన్నతిరుపతి క్షేత్రం శనివారం భక్తజన సంద్రంగా మారింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో పాటు, సంక్రాంతి పండుగ సెలవులు నేపథ్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు క్షేత్రాన్ని సందర్శించారు. ఉదయం నుంచే భక్తుల రాక మొదలవడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంతో పాటు, అనివేటి మండపం, దర్శనం క్యూలైన్లు భక్తులతో కిక్కిరిశాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్, టికెట్ కౌంటర్లు, కేశఖండన శాల ఇతర విభాగాలు భక్తులతో పోటెత్తాయి. అనివేటి మండపంలో పలు భజన మండళ్ల సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను అలరించాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.

క్లుప్తంగా

వరాల వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు



ఈడూరులో విశేష అలంకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరు గ్రామంలో వరాల వెంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ, ఉదయం అర్చనలు జరిపారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారిని తులసి మాలు, పలు రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కాలినడకన హాజరై స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. హాజరైన భక్తులకు దాతల సహకారంతో అన్నసమారాధన జరిపారు.

రీ-సర్వేపై అవగాహన ర్యాలీ



నవాబుపాలెం గ్రామంలో రీ-సర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నవాబుపాలెం గ్రామంలో రీ-సర్వేపై అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్ మాట్లాడుతూ రైతులు తమ భూమి రికార్డుల్లో తలెత్తిన తప్పొప్పులను రీ-సర్వే ద్వారా సరి చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మద్దుకూరి గంగాభవాని, గ్రామ టీడీపీ నాయకులు మద్దుకూరి ధనరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ



వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమంలో శనివారం వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. గ్లోబల్ సపోర్టు ఆర్గనైజేషన్ వ్యవస్థాపకురాలు చెన్నా త్రికళ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు చెన్నా జనార్ధనరావు మాట్లాడుతూ గ్లోబల్ సపోర్టు ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీవీఆర్ కళాకేంద్రం వ్యవస్థాపకులు బుద్దాల వెంకటరామారావు మాట్లాడుతూ ఒంటరి మహిళలకు, పేద విద్యార్థులకు త్రికళ ఎన్నో ఆర్థిక సహాయాలు అందజేస్తున్నారన్నారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బొడ్డు సాయిబాబా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మాజీ, ఆశ్రమ నిర్వాహకులు కేశవ, సాయి భార్గవి, ధనకొండ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సామాజిక పింఛన్ల తనిఖీ



ఇరగవరంలో పింఛన్లను తనిఖీ చేస్తున్న అధికారులు

ఇరగవరం: సామాజిక పింఛన్ల తనిఖీలో భాగంగా శనివారం ఇరగవరం మండలం అర్జునుడు పాలెం, ఇరగవరం1, 2, గోటేరు, కావలిపురం, రేలంగి 1,2,4 గ్రామాల్లో మంచానికే పరిమితైన పెన్షనర్లను అధికార బృందం తనిఖీ చేసింది. ఈ తనిఖీలో స్టేట్‌టీం డాక్టర్ జాన్ హరీషన్, జిల్లా టీం డాక్టర్ సుష్మా, డాక్టర్ వై.మౌనిక, డాక్టర్ సాయి గిరి రెడ్డి, ఎంపీడీఓ ఎ.శ్రీనివాసు, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కోడి పందేలను అడ్డుకోవాలి



పోలీసులకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఇరగవరం: మండలంలో నిషేధిత కోడి పందేలను అధికారులు అడ్డుకోవాలని, బాధ్యులైన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల పార్టీ కన్వీనర్ కామన మున్సిస్వామి కోరారు. శనివారం ఇరగవరం మండల పోలీస్ స్టేషన్ అధికారులకు ఆర్థికపరమైన కోడి పందేలను ఆపాలని వినతిపత్రం అందజేశారు.



అత్తిలిలో కోడి పందేలకు ముస్తాబవుతున్న బరి



తణుకు జాతీయ రహదారి సమీపంలో కోడి పందేల రెడీ అవుతున్న ప్రాంతం

పందేలకు సై..

- గ్రామాల్లో ముస్తాబవుతున్న బరులు
- జరగనివ్వబోమంటున్న పోలీసులు..
- తణుకు నియోజకవర్గంలో సుమారుగా 22 బరులు



తణుకు రూరల్ పరిధిలో కోడి పందేలు నిషేధం అంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన ఎస్సై చంద్రశేఖర్



గోటేరులో కోడి పందేలకు సిద్ధం చేస్తున్న బరి

తణుకు అర్బన్: సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించే కోడి పందేల బరులు తణుకు నియోజకవర్గంలో ముస్తాబవుతున్నాయి. బరులు ముస్తాబు చేయడంలో నిర్వాహకులు నిమఘ్నం కాగా పోలీసులు మాత్రం కోడిపందేలు నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవంటూ ప్రకటనలు చేస్తుండడం విశేషం. సంస్కృతి సంప్రాదాయాల్లో భాగంగానే కోడి పందేలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు చెబుతున్నా న్యాయస్థానం ఆదేశాల మేరకు కోడి పందేలు జరగనివ్వబోమని చెబుతున్న పోలీసుల వ్యవహారంలో కోడి గెలుస్తుందో లేక ఖాకీ గెలుస్తుందో వేచిచూడాల్సిందేనని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

తణుకు నియోజకర్గంలో 22 బరులు

తణుకు నియోజకవర్గంలోని తణుకు పట్టణం, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల్లో కోడి పందేలు నిర్వహించేందుకు సుమారుగా 22 బరులు ఏర్పాట్లు చేస్తున్నట్లుగా సమాచారం. ఇందుకు సంబంధించి నిర్వాహకులు ఇప్పటికే ఆయా స్థలాల్లో అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. పందేలకు సంబంధించి కోళ్ల, కోళ్లకు కట్టే కత్తులు, బరి ఆవరణలో ఏర్పాటుచేసే గుండాటలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అయితే తణుకు పట్టణ సర్కిల్, రూరల్ సర్కిల్ పరిధిలో ఇప్పటివరకు కోడి పందేలు నిర్వహించే వారితోపాటు కోళ్లకు కత్తులు కట్టేవారికి సంబంధించి 155 మందిని బైండోవర్ చేసినట్లుగా పోలీసు అధికారులు చెబుతున్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ విశ్వనాథ్

తణుకు అర్బన్: సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలు, పేకాట, గుండాట వంటి చట్ట వ్యతిరేక జూదక్రీడలను నిర్వహిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తాడేపల్లిగూడెం డీఎస్పీ డి.విశ్వనాథ్ హెచ్చరించారు. తణుకు పట్టణ పోలీసు స్టేషన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తణుకు పట్టణం, రూరల్ సర్కిళ్ల పరిధిలో పండుగ నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలుగకుండా తీసుకునే చర్యల్లో భాగంగా సంఘ వ్యతిరేక కార్యకలాపాలైన కోడిపందేలు, జూదం, గుండాట, కోతాట వంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా పెడుతున్నామని, ఇప్పటికే తణుకు, తణుకు రూరల్ సర్కిల్ పరిధిలో 155 మందిని బైండోవర్ చేసినట్లు చెప్పారు. సబ్ డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 300 మందిని బైండోవర్ చేశామన్నారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ఎవరైనా కోడిపందేలు నిర్వహించినా, పందేల నిర్వహణకు స్థలాలు, భూములు ఇచ్చిన యజమానులపైనా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తణుకు పట్టణ, రూరల్ సీఐలు కొండయ్య, కృష్ణకుమార్, ఎస్సై శ్రీనివాస్, రూరల్ ఎస్సై చంద్రశేఖర్ ఉన్నారు.

● సంక్రాంతి సందడి



అత్తిలి : సంక్రాంతి సంబరాలలో భాగంగా చిన్నారుల నృత్యప్రదర్శన దృశ్యం



తాడేపల్లిగూడెం(టీఓసీ): సాంస్కృతిక కార్యక్రమాలు



పెంటపాడు : టీబీఆర్ స్కూలు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం



తణుకు అర్బన్: మాంటిస్సోరీ స్కూలులో సంక్రాంతి సంబరాలను ప్రారంభిస్తున్న డైరెక్టర్ ప్రకాశరావు



తణుకు అర్బన్: మాంటిస్సోరీ స్కూలులో హరిదాసులకు బియ్యం వేస్తున్న చిన్నారులు



ఇరగవరం : జిల్లాపరిషత్ హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు

తాడేపల్లిగూడెం, తణుకు నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో గురువారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా సంబరాలను భోగి మంటలు వెలిగించి ప్రారంభించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో సందడి చేశారు. బొమ్మల కొలువు సెట్టింగ్‌లు ఆకట్టుకున్నాయి. డూడూ బసవన్నల విన్యాసాలు, కోలాటం, హరిదాసులు, కొమ్ముదాసరులు, సోదెమ్మ, పిట్టలదొర, దేవతామూర్తుల వేషదారణలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. - సాక్షి, నెట్‌వర్క్

తణుకులో 24, 25 తేదీల్లో బాలోత్సవం



తణుకులో బాలోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: విద్యార్థుల్లో సృజనాత్మకత, విద్యపై ఆసక్తిని పెంచే క్రమంలో తణుకులో ఈనెల 24, 25 తేదీల్లో బాలోత్సవాలు నిర్వహిస్తున్నట్లు బాలోత్సవాల అధ్యక్షుడు పీఎల్ నరసింహారావు, ప్రధాన కార్యదర్శి పి.దక్షిణామూర్తి పేర్కొన్నారు. తణుకు కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించే ఈ బాలోత్సవంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, చిత్రలేఖనం, పోస్టర్ ప్రజంటేషన్ వంటి 14 రకాలు, అకడమిక్ అంశాల్లో దేశభక్తి, అభ్యుదయ గీతాలాపన, ఏకపాత్రాభినయం వంటి 9 రకాల కల్చరల్ అంశాల్లోను ప్రతిభా ప్రదర్శనలో భాగంగా పిల్లల సంబరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో 2500 మందికిపైగా విద్యార్థులు పాల్గొననున్నట్లు చెప్పారు. ఈనెల 26వ తేదీన విజేతలైన విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం ఉంటుందని వివరించారు. అనంతరం బాలోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ఏఎస్‌వీ శేషుబాబు, సభ్యులు డాక్టర్ జె.చంద్రప్రసాద్, గోపాలరెడ్డి, వై.రాజ్యలక్ష్మి, రాజేంద్రప్రసాద్, భద్రం తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేల బరులు ధ్వంసం



కోడిపందేల బరులను ధ్వంసం చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కడియద్ద, పెదతాడేపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కోడిపందేల బరులను శనివారం రూరల్ ఎస్సై జేవీఎస్.ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడిపందేలు, గుండాట, పేకాట వంటి జూద క్రీడలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కడియద్ద గ్రామంలో కోడిపందేల నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

బస్సుల్లో అధిక చార్జీలు వసూళ్లు చేయొద్దు



ప్రైవేట్ బస్సులను తనిఖీలు నిర్వహిస్తున్న ఎంవీఐ డి.సరేంద్ర సింగ్ నాయక్

తాడేపల్లిగూడెం (టీఓసీ): సంక్రాంతి పండుగకు సొంత ఊర్లకు బయలు దేరుతున్న ప్రయాణికులు నుంచి టిక్కెట్లు ధరల కంటే అధిక ధరలు వసూలు చేస్తే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను సీజ్ చేస్తామని ఎంవీఐ డి.సురేంద్ర సింగ్‌నాయక్ అన్నారు. జిల్లా రవాణా శాఖ అధికారి ఆదేశాలు మేరకు ట్రావెల్స్ బస్సులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.ప్రైవేట్ బస్సు ఆపరేటర్లు ప్రయాణీకులు వద్ద నుంచి అధిక ధరలు వసూలు చేయొద్దని, వినని పక్షంలో చట్టపరంగా తీవ్రమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

సచివాలయ ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలి

ఆకివీడు: సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రామ, వార్డు ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలని ఆరోగ్య శాఖమంత్రి సత్య కుమార్ యాదవ్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఎన్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎం.వెంకటలక్ష్మి మాట్లాడుతూ హెల్త్ సెక్రటరీలకు గ్రేడ్ 3 ఏఎన్‌ఎం నుంచి ఎంపీహెచ్ఏ ఫిమేల్ పదోన్నతి కోసం అక్టోబర్ 7న వినతి పత్రం అందజేశామన్నారు. సీనియార్టీ మెరిట్ లిస్టు ఇతర జిల్లాల నుంచి రాకపోవడంతో పదోన్నతి కల్పించలేదని చెప్పారని, అన్ని జిల్లాల నుంచి జాబితాను త్వరితగతిన వచ్చే విధంగా చర్యలు తీసుకుని, పదోన్నతి కల్పించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో సంఘ సభ్యులు వి.దుర్గ, పీ.బేబీ దైవాజీ, వీ.అరుణ, వెంటలక్ష్మి, సౌశీల్య, జయమణి, నాగమణి ఉన్నారు.

శానిటరీ వర్కర్స్‌కు కనీస వేతనాలు చెల్లించాలి

పెనుగొండ: ఐదేళ్లుగా ప్రాథమిక,ఉన్నత పాఠశాలలో ఆయాలుగా పనిచేస్తున్న శానటరీ వర్కర్స్‌లో కనీస వేతనాలు రూ.26 వేలు, నెలనెలా వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం పెనుగొండ పంచాయతీ పార్కు వద్ద జరిగిన శానిటరీ వర్కర్స్ సమావేశంలో తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు అమలు చేయాలని, రోజుగు నాలుగు సార్లు టాయిలెట్స్ శుభ్రం చేస్తున్నా ప్రభుత్వ విధానాలతో ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న అజయకుమారి

తణుకు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన కరెంట్ చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్, పట్టణ కార్యదర్శి అడ్డగర్ల అజయ కుమారి డిమాండ్ చేశారు. స్థానిక అమరవీరుల భవనంలో శనివారం నిర్వహించిన సీపీఎం కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసుకునే భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.15వేల కోట్లు విద్యుత్ భారాన్ని ప్రజలపై వేయడం అన్యాయమన్నారు. అసలే నిత్యావసర సరుకుల ధరలు, గ్యాస్, ఇంటి పన్నులు, పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగి ప్రజలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ప్రజలు వాడిన కరెంట్ కంటే ట్రూఅప్, సర్దుబాటు పేర్లతో గతంలో వాడిన దానికి ఇప్పుడు భారం వేయడం ఏమిటని ప్రశ్నించారు. ఆదాయాన్ని పెంచుతామని, ఉన్న ఆదాయాలు కొల్లగొట్టే విధానం అన్యాయమని, ప్రజలపై భారం మోపడంపై ఉన్న శ్రద్ధ తగ్గించడంలో లేకపోవడం బాధాకరమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గుబ్బల గోపి, జు నాగరత్నం, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మ వారి వార్షిక ఉత్సవాల ఏర్పాట్లు భీమవరం డీఎస్పీ జయసూర్య శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల ఏర్పాట్లల్లో ఎలాంటి లోపాలు లేకుండా పక్కాగా ఉండాలని నిర్వాహికులకు సూచించారు. క్యూ లైన్లల్లోని భక్తులు ఇబ్బందులు లేకుండా వెళ్లి అమ్మవారి దర్శనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్సవాలల్లో అమ్మవారిని దర్శించుకొవడానికి జనం పెద్ద సంఖ్యలో తరలివస్తారు కాబట్టి దేవస్థానం వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. ఆయన వెంట ఆలయ ఈఓ బుద్ద మహలక్ష్మీ నగేష్, సీఐ నాగరాజు ఉన్నారు.

పల్లెల్లో ఘుమఘుమలు



సంక్రాంతి పిండి వంటల తయారీలో మహిళలు బిజీ





సిద్ధమవుతున్న సున్నుండలు, కజ్జికాయలు, అరిసెలు

పెంటపాడు: సంక్రాంతి వస్తోందంటే తెలుగునాట ప్రతీ ఇల్లు సాంప్రదాయ పిండి వంటలతో ఘుమఘుమలాడుతుంటుంది. సంక్రాంతి సమీస్తున్న నేపథ్యంలో గృహిణులు, సున్నండలు, పోకుండలు, అరిసెలు, కజ్జికాయలు, గవ్వలు, జంతికలు, సన్నకారంపూస, బూంధీ, కోవా, కలకండ వంటి ఆధునిక పండి వంటలు సైతం సంక్రాంతి వంటకాల్లో చేరి మరింత మాధుర్యాన్ని అందిస్తున్నాయి. పేద, దనిక తారతమ్యం లేకుండా పల్లెల్లో ప్రతి ఇంటా పిండి వంటల తయారీకి ప్రాధాన్యమిస్తారు. స్తోమత మేరకు జంతికలు, సున్నుండలు, బెల్లం ఉండలు, మైసూర్ పాక్, జంతికలు, కారపు బూందీ తదితర వెరైటీలు చేస్తుంటారు. కొత్తగా వివాహం జరిగిన ఇళ్లలో పండి వంటల తయారీలో మరింత సందడి నెలకొంటుంది. పండగకు వచ్చే కొత్త అల్లుళ్లు, వియ్యపరాళి కోసం ఎన్నో రకాల పిండి వంటలు సిద్ధం చేస్తుంటారు. దూర ప్రాంతాలు నుంచి వచ్చిన కుటుంబ సభ్యులు, బంధువులకు తిరిగి వెళ్లే సమయంలో వాటిని అందిస్తుంటారు. కొందరు దేశ, విదేశాల నుంచి పండుగకు వచ్చి తిరిగి వెళుతూ ఈ పిండి వంటలు తీసుకువెళతారు. వారి ద్వారా స్థానికులు అక్కడ ఉన్న తమ బంధువులకు ప్రత్యేకంగా పిండి వంటలు తయారు చేసి పంపుతుంటారు.

హోం ఫుడ్ షాపులలో సాంప్రదాయ వంటలు

గతంలో ప్రతీ ఇంటా మహిళలు చుట్టుపక్కల వారితో కలిసి పిండివంటలు తయారు చేసుకోగా ప్రస్తుత యాంత్రిక జీవనంలో తీరిక లేక ఇళ్ల వద్ద వండి వంటలు తయారు చేసుకొనే తీరిక లేకుండా ఎవరికి వారు బిజీ అయిపోయారు. ఈ నేపథ్యంలో పిండి వంటలు షాపుల్లో కొనుగోలు చేస్తున్న వారి సంఖ్య పట్టణాల్లోనే కాక గ్రామీణ ప్రాంతాల్లో సైతం పెరుగుతోంది. ఏడాది పొడవునా కలకండ, కోవా, కాజా పేస్ట్ తదితర వెరైటీ స్వీట్స్ తయారు చేసే స్వీట్స్ షాపుల నిర్వాహకులు సంక్రాంతి పండుగల్లో ఈ వంటలనే ఆర్డర్ చేస్తున్నారు. కాగా ఏది ఏమైనా సంక్రాంతికి చేసే పిండివంటల రుచే వేరని వాధించేవారు కూడా ఉన్నారు. పట్టణాలలో ఈ పద్ధతి ఉండగా ఇంకా పల్లెలు మాత్రం సాంప్రదాయం మర్చీ పోలేదు. స్వయంగా పిండివంటలు చేసుకొంటేనే కానీ పండుగ చేసినట్లు కాదని కొందరు మహిళలు చెబుతున్నారు.